


'స్కిల్‌హబ్'లో చేరికకు దరఖాస్తుల ఆహ్వానం

ఎచ్చెర్ల, మే 10(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐలో ఏపీఎస్‌ఎస్‌డీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్కిల్‌హబ్ సెంటర్‌లో వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఐటీఐ ప్రిన్సిపాల్ ఎల్.సుధాకరరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 'అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, మాన్యువల్ మెటల్ ఆర్క్ వెల్డింగ్ కోర్సులో శిక్షణకు ఈ నెల 15లోగా నేరుగా ఐటీఐను సంప్రదించాలి. 18-30ఏళ్లలోపు కలిగి.. పదో తరగతి ఆపైన విద్యార్హత గల అభ్యర్థులు ఈ కోర్సుల్లో చేరేందుకు అర్హులు. మరిన్ని వివరాలకు స్కిల్‌హబ్ సెంటర్ కోఆర్డినేటర్ ఫోన్ నెంబరు 79891 77887కు సంప్రదించాల'ని ప్రిన్సిపాల్ తెలిపారు.



కళింగపట్నం రోడ్డులో అంపోలు వద్ద శనివారం ఉదయం 7.30 గంటలకు కురుస్తున్న మంచు

'మంచు'టెండ

శ్రీకాకుళం, మే 10(ఆంధ్రజ్యోతి): పేదల ఊటీగా పేరుగాంచిన శ్రీకాకుళం జిల్లాలో విచిత్రమైన వాతావరణం నెలకొంది. మండువేసవిలో పగటిపూట 40 డిగ్రీల ఉష్ణోగ్రత దాటుతోంది. శనివారం మాత్రం ఉదయాన కొన్నిచోట్ల మంచు కురిసింది. శ్రీకాకుళం నుంచి కళింగపట్నం వెళ్లే రోడ్డులో ఒప్పంగి గ్రామ పరిసరాల్లో శీతాకాలం మాదిరిగా పొగమంచు కురిసింది. ఉదయం 8.30 గంటల వరకు మంచు కురవడంతో ప్రజలకు కాస్త ఉపశమనం లభించింది. 9 గంటల తర్వాత మళ్లీ ఎండ తీవ్రత పెరిగింది. దీంతో ప్రజలు ఆపసోపాలు పడ్డారు. బయటకు రావాలంటేనే హడలిపోయారు. ఈ నేపథ్యంలో నిత్యం రద్దీగా ఉండే శ్రీకాకుళంలోని పెద్దమార్కెట్ సైతం శనివారం మధ్యాహ్నం వెలవెలబోయింది.



మంచుకు తడిసిన మొక్కజొన్న గింజలను రోడ్డుపై ఆరబెడుతున్న రైతులు



శ్రీకాకుళంలో శనివారం మధ్యాహ్నం వెలవెలబోతున్న పెద్ద మార్కెట్



పంజాబ్ నుంచి ఢిల్లీ రైల్వేస్టేషన్‌కు రైలులో వస్తున్న విద్యార్థులు

బిక్కుబిక్కుమంటూ..

- పంజాబ్ నుంచి స్వగ్రామాలకు బయలుదేరిన విద్యార్థులు

పలాస, మే 10(ఆంధ్రజ్యోతి): భారత్-పాకిస్థాన్ యుద్ధం నేపథ్యంలో పంజాబ్‌లోని ఓ ప్రైవేటు యూనివర్శిటీ విద్యార్థులు స్వగ్రామాలకు బిక్కుబిక్కుమంటూ శనివారం బయలుదేరారు. నాలుగురోజులుగా పీఓకేలోని టెర్రరిస్టు స్థావరాలపై మన బలగాలు దాడులు చేస్తున్న నేపథ్యంలో ప్రతిచర్యగా పాకిస్థాన్ కూడా దాడులకు తెగబడింది. ఈ నేపథ్యంలో పాకిస్థాన్‌కు సరిహద్దుగా ఉన్న పంజాబ్ రాష్ట్రంలోని యూనివర్శిటీ యాజమాన్యం విద్యార్థులను అప్రమత్తం చేసింది. స్వస్థలాలకు వెళ్లిపోవాలని, ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహిస్తామని, సొంత పూచీకత్తుపై ఉండాలనుకుంటే ఉండొచ్చని స్పష్టం చేసింది. దీంతో అక్కడున్న విద్యార్థులంతా స్వస్థలాలకు వెళ్లిపోతున్నారు. మన రాష్ట్రానికి చెందిన విద్యార్థులు పంజాబ్ నుంచి ఢిల్లీ రైల్వేస్టేషన్‌కు శనివారం సాయంత్రం బయలుదేరారు. అక్కడ నుంచి విమానాశ్రయానికి చేరుకుని విశాఖ, హైదరాబాద్ వచ్చేందుకు టిక్కెట్లు రిజర్వేషన్ చేసుకున్నారు. ఇదే అదనుగా విమాన టిక్కెట్ ధరలు అమాంతంగా పెంచినట్లు విద్యార్థులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటువంటి సమయంలో కూడా టిక్కెట్ రేట్లు పెంచితే సాధారణ విద్యార్థుల పరిస్థితి ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. ఢిల్లీ నుంచి విశాఖకు రూ.5,500 టిక్కెట్ ధర ఉండగా ప్రస్తుతం రూ.7వేల వరకూ పెంచినట్లు విద్యార్థులు చెబుతున్నారు. గంట గంటకు టిక్కెట్ ధరలు మారిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడున్న యూనివర్శిటీలో మొత్తం 30వేల మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఇందులో సింహభాగం ఆంధ్రా, తెలంగాణ విద్యార్థులు ఉండడం విశేషం.

స్వగ్రామాలకు వస్తున్నాం




రెండు రోజుల కిందట దూరంగా బాంబులు వెళ్తుండడాన్ని గుర్తించి భయపడ్డాం. మంటలు రావడాన్ని ప్రత్యక్షంగా చూశాం. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు సెలవులు ఇవ్వడంతో స్వగ్రామాలకు వస్తున్నాం.

-పి.చెన్నకేశవరెడ్డి, ఇంజనీరింగ్ విద్యార్థి, పంజాబ్‌లోని ప్రైవేటు యూనివర్శిటీ

ఖరీఫ్‌నకు సన్నద్ధం

- వ్యవసాయశాఖ ముందస్తు ప్రణాళికలు
- 41,120 క్వింటాళ్ల విత్తనాలు.. 13వేల మెట్రిక్‌టన్నుల ఎరువులు సిద్ధం



టెక్కలి/ఇచ్ఛాపురం, మే 10 (ఆంధ్రజ్యోతి)

జిల్లాలో వ్యవసాయశాఖ ఖరీఫ్ ప్రణాళిక సిద్ధం చేసింది. విత్తనాల నుంచి ఎరువుల దాకా ఎంత మేర అవసరమో అంచనాలు రూపొందించింది. రైతులకు ఇబ్బందులు రాకుండా రైతుసేవా కేంద్రాలు, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు, ప్రైవేటు డీలర్ల వద్ద విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని నిర్ణయించింది. ఇప్పటికే 41,120 క్వింటాళ్ల విత్తనాలు.. జిల్లా కేంద్రంలో అందుబాటులో ఉంది. అక్కడ నుంచి రైతుసేవా కేంద్రాలకు తరలించి.. త్వరలో రైతులకు అందించనుంది. అలాగే 13వేల మెట్రిక్ టన్నుల ఎరువులు బఫర్ స్టాక్ సిద్ధం చేసింది.

- జిల్లాలో ఏటా ఖరీఫ్ సీజన్‌లో 4.25 లక్షల ఎకరాల్లో వరిసాగు చేస్తారు. వరి, ఇతర ఆహార పంటలతో పాటు ఆయిల్‌పామ్, పత్తి, గోగు తదితర పంటలను వేలాది ఎకరాల్లో పండిస్తారు. వరి విత్తనాలకు సంబంధించి 41,120 క్వింటాళ్లు, పచ్చిరొట్ట, వేరుశనగ 30, కందులు 30, మినుములు 50, పెసలు 50 క్వింటాళ్లు చొప్పున సిద్ధం చేశారు. ముందుగా పచ్చిరొట్ట విత్తనాలు 50 శాతం రాయితీపై రైతులకు అందించనున్నారు. గత అనుభవాల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈసారి జిల్లా యంత్రాంగం ముందే మేల్కొంది. విత్తన ఎంపికపైనా దృష్టిపెట్టింది. గతంలో రైతులు తమ ప్రాంతాలు, భూమికి అనుగుణంగా విత్తనాలు అవసరమని అడిగారు. కానీ ప్రభుత్వం ఇవ్వలేకపోయింది. ఈ ఏడాది ఆ పరిస్థితి రాకుండా అన్నిరకాల విత్తనాలు (మిగతా 6వ పేజీలో..)



విత్తనాల నిల్వలు (ఫైల్)

విత్తనాల సిద్ధం ఇలా.. (క్వింటాళ్లలో)

1061 (ఇంద్ర) -	8,700
1064 (అమర) -	3,250
ఎంటీయూ 1121 -	8,320
7029 స్వర్ణ -	3,800
ఎంటీయూ 1,318 -	2,050
ఆర్‌జీఎల్ 2537 (శ్రీకాకుళం సన్నాలు) -	2,900
3291 (సోనామసూరి) -	2,000
5204 (సాంబమసూరి) -	660
ఎంటీయూ1224 (మార్టూరు సాంబ)-	3,500
కందులు ఎల్‌ఆర్జీ-52 రకం -	30
వేరుశనగ కే6 రకం -	30
మినుము ఐసీయూ2-43 రకం -	50
పెసర ఐపీఎం 2-14 రకం -	50

ఉపాధ్యాయ బదిలీలకు రెడీ



- ఉమ్మడి జిల్లాలో 10వేలకు పైగా సీనియారిటీ జాబితా సిద్ధం

నరసన్నపేట, మే 10(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీలు, ఉద్యోగన్నతుల కల్పనకు విద్యాశాఖాధికారులు సన్నద్ధమవుతున్నారు. ప్రభుత్వ ఉత్తర్వులు రాగానే ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు డీఈవో కార్యాలయంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 10వేల మందికిపైగా ఉపాధ్యాయుల ప్రొవిజనల్ సీనియారిటీ జాబితాను సిద్ధం చేశారు. పొరపాట్లు, అభ్యంతరాలు ఉంటే మార్పులు, చేర్పులు చేసే అవకాశం ఉంది. కమిషనర్ నుంచి ఆదేశాలు రాగానే తుది జాబితా ప్రకటిస్తారు. స్కూళ్ల పునర్నిర్మాణం, ఉపాధ్యాయ పోస్టుల నియామకం, ఖాళీల వివరాలను డైరెక్టర్ నుంచి వచ్చే ఆదేశాల మేరకు అధికారంగా ప్రకటించే అవకాశం ఉంది. ఆది, సోమవారాల్లో ఉద్యోగులు అప్రమత్తంగా ఉండేలా చూడాలని కమిషనర్ విజయ రామరాజు ఆదేశించినట్లు తెలుస్తోంది.

- నేడో.. రేపో షెడ్యూల్

ఉపాధ్యాయుల బదిలీల షెడ్యూల్‌ను నేడో.. రేపో విడుదల చేసేందుకు విద్యాశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. మోడల్ పాఠశాలల విషయానికి చెందిన కొన్ని జిల్లాల నుంచి మార్పులు చేయడం, అలాగే జీవో 117రద్దుకు ప్రత్యామ్నాయంగా ఉపాధ్యాయులు సర్దుబాటు విధానం తదితర అంశాలపై ఉపాధ్యాయ సంఘాలతో తర్జనభర్జన నేపథ్యంలో జాప్యమైంది. ఆదివారం ఉపాధ్యాయుల బదిలీల షెడ్యూల్ విడుదలకు మార్గదర్శికాలను జారీ చేయనుంది. సోమవారం నుంచి బదిలీల పక్రియ చేపట్టే అవకాశం ఉందని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

పంట కాలువ పూడ్చివేత

- ఫిర్యాదు చేసినా పట్టని అధికారులు
- ఆందోళనలో రైతులు



ప్రభుత్వం నిర్మించిన సిమెంట్ కాలువ

ఆమదాలవలస, మే 10(ఆంధ్రజ్యోతి): ఆమదాలవలస మండలం బొబ్బిలిపేటలో సుమారు 150 ఎకరాలకు సాగునీరు అందిస్తున్న కాలువను కొంత మంది వ్యక్తులు మట్టితో పూడ్చేశారు. దీనిపై ఇటీవల అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామానికి చెందిన రైతు మెట్ట శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 'బొబ్బిలిపేటలో బాగమ్మ చెరువు నుంచి కాలువ ద్వారా 70 మంది రైతుల పొలాలకు సాగునీరు అందేది. ప్రభుత్వం ఇటీవల రూ.8లక్షలతో పక్కాగా సిమెంట్‌తో ఆ కాలువ నిర్మాణ పనులు చేపట్టింది. కొన్నాళ్ల కిందట గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు ఆ సిమెంట్ కాలువలో ట్రాక్టర్లతో మట్టిని వేసి పూడ్చేసి ఆక్రమించారు. దీనిపై కాలువ ఆయకట్టు రైతులతో కలిసి ఆమదాలవలస తహసీల్దార్ కార్యాలయంలో నెలరోజుల కిందట ఫిర్యాదు చేసినా.. నేటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదు. మరికొద్ది రోజుల్లో ఖరీఫ్ సాగు పనులు ప్రారంభించాల్సి ఉంది. కాలువ ద్వారా నీరు అందకపోతే సాగు ఎలా చేయాలో తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించకపోతే.. భవిష్యత్తులో గ్రామం చుట్టూ ఉన్న అన్ని సాగునీటి కాలువలు కూడా ఆక్రమణలకు గురయ్యే ప్రమాదం ఉంద'ని శ్రీనివాసరావు తెలిపారు. ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై తహసీల్దార్ రాంబాబు వద్ద ప్రస్తావించగా.. కాలువ ఆక్రమించిన వ్యక్తులకు నోటీసులు జారీ చేశామన్నారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



పంట కాలువకు అడ్డంగా వేసిన మట్టి



అభినందన సభలో పాల్గొన్న ఆర్టీసీ ఉద్యోగులు

ఆదర్శ ఉద్యోగులకు ప్రోత్సాహకాలు

అరసవల్లి, మే 10(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం ఆర్టీసీ 2వ డిపో గ్యారేజీ ఆవరణలో శనివారం ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ నిర్వహించారు. గత నెలలో అత్యధిక కేఎంపీఎల్ సాధించడంలో ప్రతిభ చూపిన ఇద్దరు డ్రైవర్లకు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. ఎస్.అప్పన్నకు ప్రథమ, ఎస్.లక్ష్మణరావుకు ద్వితీయ బహుమతి అందజేశారు. అలాగే ఈపీకే నందు ప్రతిభ చూపిన ఏడుగురు కండక్టర్లు.. పి.రామకృష్ణ, ఎస్‌జె.రావు, జీకే నాయుడు, బీఆర్.మూర్తి, జి.చంద్రరావు, కేవీ రమణకు కూడా నగదు బహుమతులను అందజేశారు. ఇంధన పొదుపు, ఓఆర్ పెంపుదల గురించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో 2వ డిపో మేనేజర్ రవిశంకర్ శర్మ, చాణక్య, అసిస్టెంట్ ఇంజనీర్ రమేష్, మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

వేసవి సెలవులు.. నైపుణ్యాలకు మెరుగులు

- సద్వినియోగం చేసుకుంటే ఉపయుక్తం
- క్రీడలు, సంగీతం, నృత్యంపై శిక్షణతో మేలు
- పర్యాటక ప్రాంతాల సందర్శనతో విజ్ఞానం

6లో

మహాలక్ష్మీ నగర్‌లో చోరీ

- 9తులాల బంగారం ఆభరణాలు, రూ.20వేల నగదు అపహరణ
- నిందితుల కోసం పోలీసుల గాలింపు

8లో

వేసవి సెలవులు

నైపుణ్యాలకు మెరుగులు

- సద్వినియోగం చేసుకుంటే ఉపయుక్తం
- క్రీడలు, సంగీతం, నృత్య శిక్షణతో మేలు
- పర్యాటక ప్రాంతాల సందర్శనతో విజ్ఞానం
- అందుబాటులో స్పోకెన్ ఇంగ్లీష్, క్రాష్ కోర్సులు

నరసన్నపేట, మే 10(ఆంధ్రజ్యోతి): పాఠశాలలకు వేసవి సెలవులు ఇచ్చి రెండు వారాలు దాటింది. జూన్ 11వ తేదీ వరకూ ఈ సెలవులు కొనసాగనున్నాయి. 46 రోజులు పిల్లలకు హాలిడేస్ ఇచ్చారు. అయితే, ఈ సెలవుల్లో పిల్లలు వివిధ నైపుణ్యాలను మెరుగుపరుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. లోపాలను సరిదిద్దుకునేందుకు, వెనుకబాటుతనాన్ని అధిగమించేందుకు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలని చెబుతున్నారు. విజ్ఞానాన్ని పెంపొందించే యాత్రలు, నైపుణ్య శిక్షణ తదితర అంశాలపై నిపుణులతో మాట్లాడి 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న ప్రత్యేక కథనం మీకోసం.



పర్యాటకానందం..

వేసవి సెలవులంటేనే పర్యాటక కాలమని చెప్పొచ్చు. అభిరుచి మేరకు ఆధ్యాత్మిక సందర్శక స్థలాలను ఎంచుకుని వెళ్లి రావచ్చు. ఎక్కడో సుదూర ప్రాంతాలకు వెళ్లే అవకాశం లేనివారు నిరాశ చెందనవసరం లేదు. జిల్లాలో పలు పర్యాటక ప్రాంతాలు ఉన్నాయి. అరసవల్లి సూర్యనారాయణ దేవస్థానం, శ్రీకూర్మం, శ్రీముఖలింగం, బారువతీరం, శాలిహుండం, ఉద్దానం కొబ్బరితోటలు, సిక్కోలు సాగర తీరాలను సందర్శించవచ్చు. దీనివల్ల పర్యాటక ఆనందంతో పాటు విజ్ఞానాన్ని పిల్లల్లో పెంపొందించవచ్చు. రైల్వేస్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్‌లకు తీసుకువెళ్లి ప్రయాణికుల రాకపోకలు, టికెట్ తీసుకునే విధానాన్ని నేర్పవచ్చు.

సేవా కార్యక్రమాలు

డిగ్రీ, ఇంజనీరింగ్ విద్యార్థులు సెలవుల్లో కొంత సమయాన్ని సేవా కార్యక్రమాలకు కేటాయించాలి. దీనివల్ల సామాజిక బాధ్యతను నెరవేర్చిన వారవుతారు. విద్యాసంవత్సరంలో వారానికి ఒక్కరోజు మాత్రమే పాల్గొంటూ ఉంటారు. ఇది సాధ్యంకాని వారు వేసవి సెలవుల్లో ఎక్కువ సమయం సేవా కార్యక్రమాల కోసం కేటాయిస్తే బాగుంటుంది. పలు స్వచ్ఛంద సంస్థల్లో, కమ్యూనిటీ పోలీస్ వ్యవస్థలో చేరి సేవలను అందించవచ్చు.

పుస్తకపఠనం..

తరగతి పుస్తకాలు తప్ప సాహిత్యం వంటి పుస్తకాలను చదివే విద్యార్థులు మచ్చుకైనా కానరావడం లేదు. వేసవిలో తరగతి పుస్తకాలతో పనిఉండదు. కాబట్టి ప్రముఖల జీవిత చరిత్రలు, సాహిత్యం, శాస్త్రీయ విజ్ఞానం పెంపుదించే అంశాలకు చెందిన పుస్తకాలను చదవడాన్ని పిల్లలకు అలవాటు చేయాలి. చందమామ కథలతో మొదలు పెట్టి వారికి ఇష్టమైన అంశాల చుట్టూ తిప్పి మెల్లగా పఠనాసక్తిని పెంచాలి. అలాగే రచనాశక్తి పట్ల అభిరుచి పెరిగేలా ప్రోత్సహిస్తే వారిలోని ఆలోచన పరిధి విస్తృతమవుతుంది.



శాలిహుండం బౌద్ధ స్థూపాలు

క్రీడా శిక్షణకు కొదవే లేదు

క్రీడలంటే ఆసక్తి ఉన్నవారికి శిక్షణ కేంద్రాలకు కొదవ లేదు. క్రికెట్, వాలీబాల్, ఫుట్‌బాల్ తదితర క్రీడలకు శిక్షణ తీసుకునే అవకాశం జిల్లా వాసులకు ఉంది. డీసీఏ, శాఫ్ ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వనున్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఏటా ప్రభుత్వమే ఉచిత శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేసే పౌష్టికాహారాన్ని కూడా అందిస్తోంది. చెస్, టెన్నిస్ వంటి క్రీడలకు శ్రీకాకుళంలో శిక్షణ కేంద్రాలు అందుబాటులో ఉన్నాయి. ఈ శిబిరాలకు ఏటా ఆదరణ పెరుగుతూనే ఉంది.

కథలు.. కార్టూన్లు.. రైమ్స్

పిల్లల మనసును ఇట్టే ఆకట్టుకునే కథలు, కార్టూన్లు, రైమ్స్ పుస్తకాలు మార్కెట్‌లో అందుబాటులో ఉంటున్నాయి. నీతికథలు, పురాణగాథలు, చందమామకథలు, సాహస కథలు.. ఇలా నచ్చిన అంశాన్ని ఎంచుకోవచ్చును. బయటకు వెళ్లలేనివారు ఇటువంటి పుస్తకాలతో పిల్లలకు విజ్ఞానాన్ని పెంచవచ్చు. పుస్తకాలు లేకుండా సీడీలు, డీవీడీలు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. దృశ్య, శ్రవణ మార్గాల ద్వారా నేర్చుకోవచ్చును.

సంగీతం.. నృత్యం

సంగీతం నృత్యం అంటే చాలా మంది ఇష్టపడతారు. ఈ రెండు అంశాలపై పట్టు సాధించేందుకు వేసవి సెలవులే మంచి సమయం. ఎందుకంటే ఎక్కువ సమయం లభిస్తుంది. అందువల్ల ఈ రెండింటిలో దేనిపై ఆసక్తి ఉంటే వాటిని నేర్పించేందుకు ప్రయత్నించాలి. శిక్షణ అందించే సంస్థలు శ్రీకాకుళం, నరసన్నపేట, పలాస, రాజాం, సోంపేట, టెక్కలి, పాలకొండ తదితర పట్టణాల్లో అందుబాటులో ఉన్నాయి.



ఆదిత్యుని ఆలయం

యోగా.. ధ్యానం

ఏడాదంతా తీవ్రమైన ఒత్తిడితో గడిపేవిద్యార్థులు యోగా, ధ్యానం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చు. ఇది నిరంతర సాధనకు సంబంధించిన అంశమే అయినా, కొంత శిక్షణ ప్రారంభంలో అవసరం. అంత సమయం సాధారణ రోజుల్లో వెచ్చించడం సాధ్యంకాదు. వేసవిలో ప్రత్యేక శిబిరాల్లో పాల్గొనడం ద్వారా అవగాహనతో పాటు సాధనకు అవకాశం దక్కుతుంది. ఏకాగ్రతను, జ్ఞాపకశక్తిని పెంచుకునేందుకు భవిష్యత్‌లో మెరుగైన ఫలితాలు పొందేందుకు విద్యార్థులకు ఈ శిక్షణ ఎంతో దోహదపడుతుంది.

క్రాష్ కోర్సులు

క్రీడలు, స్పోకెన్ ఇంగ్లీష్‌తో పాటు జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్, కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ పొందేందుకు ఈకాలం ఎంతో అనుకూలం. వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేందుకు క్రాష్ కోర్సులు ఆశ్రయిస్తుంటారు. అందుకే శిక్షణ సంస్థలకు డిమాండ్ కూడా ఎక్కువగా ఉంటుంది. కంప్యూటర్ బేసిక్స్ నుంచి డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ విద్యార్థుల వరకు అవసరమైన క్రాష్ కోర్సులను అందించే సంస్థలు ఉన్నాయి. ఈకోర్సులు నేర్చుకుంటే ఉపాధికి ఎంతో దోహదపడతాయి.

స్పోకెన్ ఇంగ్లీష్..



ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉన్నత చదువుకంటే కమ్యూనికేషన్ స్కిల్స్ ఇంగ్లీష్ భాషపై పట్టు ప్రధానమైంది. ప్రపంచ భాషపై పట్టు లేకుంటే వైఫల్యాలు వెంటాడే అవకాశం ఉంది. ఇంటర్వ్యూలో నెట్టుకురా వాలన్నా.. పరాయి ప్రాం తాలు చుట్టుకు రావాలన్నా ఇంగ్లీషు భాషపై పట్టు సాధించడం తప్పనిసరి. జిల్లాలో స్పోకెన్ ఇంగ్లీష్, పర్సనాలటీ డెవలప్‌మెంట్, సాఫ్ట్ స్కిల్స్‌పై శిక్షణ అందిస్తున్న కేంద్రాల్లో నరసన్నపేట, శ్రీకాకుళం, టెక్కలి, పలాసలో ఉన్నాయి. తెలుగు మీడియంలో చదివిన వారికి ఈకేంద్రాలు ఎంతో ఉపయుక్తం. సెలవుల్లో ఇంగ్లీష్‌లో ప్రావీణ్యం సాధించేందుకు కృషి చేయాలి.

చిత్ర లేఖనం

సాధారణంగా పిల్లలకు బొమ్మలు గీయడం అంటే ఎంతో ఆసక్తి ఉంటుంది. చిన్నప్పుడే పిచ్చిగీతలో తమ ఆసక్తిని బయటపెడుతుంటారు. కాస్త పెద్దయ్యాక ఆసక్తి మరింత పెరుగుతుంది. వారి అభిరుచిని ప్రోత్సహించేందుకు వేసవి సెలవులకు మించిన సమయం ఉండదు. చిత్రలేఖనం కార్టూన్లు, కలరింగ్ వంటి అంశాలను నేర్పించవచ్చు. ఇందుకు వేసవిలో ఉచిత శిక్షణ ఇచ్చేందుకు అనేకమంది డ్రాయింగ్ ఉపాధ్యాయులు ముందుకు వస్తున్నారు. నరసన్నపేట, పోలాకి, శ్రీకాకుళం, రాజాం తదితర ప్రాంతాల్లో శిక్షణ ఇస్తున్నారు.

వీటికి దూరంగా ఉంచాలి

ఆరోతరగతి నుంచే సెల్‌ఫోన్ వినియోగం, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్స్ అకౌంట్లు నిర్వహిస్తున్న విద్యార్థులు సంఖ్య గణనీయంగా పెరిగింది. వేసవి సెలవుల్లో వీటి జోలికిపోకుండా ఉంటే మేలు. వీడియో గేమ్స్‌పై నియంత్ర అవసరం. ఈత కొలనలు వద్ద పెద్దవారి పర్యవేక్షణ లేకండా పిల్లలను పంపించడం కూడా ప్రమాదకరమే. అందుకోసం వీటికి దూరంగా ఉండటం మంచిది. బహుళ అంతస్తుల్లో నివసించే వారు తమ పిల్లల పట్ల జాగ్రత్తలు వహించాలి. ఆటల్లో నిమగ్నమైన పిల్లలు పైఅంతస్తులకు వెళ్లేందుకు వేగంగా పరుగెడుతుంటారు. అటువంటి సమయంలో పట్టుతప్పి కిందపడిపోవచ్చు. వీటిని దృష్టిలో ఉంచుకుని పిల్లలపై డేగకన్ను వేయాల్సిన అవసరం ఉంది. చాలా మంది విద్యార్థులు ద్విచక్ర వాహనాలను నడిపేందుకు ఊవిళ్లూరుతుంటారు. అందులోనూ వేసవి సెలవుంటే వారికి పట్టని పగ్గాలుండవు. బైక్‌పై రివ్వున దూసుకుపోతుంటారు. ఇలా ఒక్కోసారి ప్రాణాల మీదకు తెచ్చుకుంటారు. 18 ఏళ్లుదాటని పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదు. వారికి అర్థమయ్యే రీతిలో సర్దిచెప్పేందుకు ప్రయత్నించాలి. గ్రామీణ ప్రాంతాల్లో చాలా మంది తల్లిదండ్రులు కుటుంబ పోషణ నిమిత్తం పనికి వెళ్తుంటారు. దీంతో పిల్లలను ఇంటి వద్దే వదిలి వెళ్లాల్సిన పరిస్థితి. ఈ సమయంలోనే పిల్లలు చెరువులు, కాలువలు, బావుల వద్దకు ఈత సరదా కోసం వెళ్తుంటారు. ఒక్కోసారి తెలియకుండానే లోతుకు వెళ్లి శ్వాస అందక ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు కోకొల్లలు. గ్రామీణ ప్రాంత తల్లిదండ్రులు ఈ విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలి. పనికి వెళ్లే సమయంలో తెలిసిన వారివద్ద తమ చిన్నారులను ఉంచడం మంచిది.





ఫ్యాషన్ డిజైనింగ్

యువతులకు ఫ్యాషన్ డిజైనింగ్‌పై ఎంతో ఆసక్తి ఉంటుంది. ఇంటర్ పూర్తి చేశాక ఉన్నత చదువులు సాగించలేనివారు, ఆర్థికంగా ఇబ్బందులు దృష్ట్యా ఉపాధి వెతుక్కునే వారు టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్ వంటి కోర్సులపై దృష్టిసారించడం ఉత్తమం. పేద వర్గాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థలు ఉచితంగా టైలరింగ్‌పై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నాయి.

ఖరీఫ్‌నకు సన్నద్ధం

(ఐదో పేజీ తరువాయి)

అందుబాటులోకి తేవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యంగా ఈ ఏడాది సన్నరకం విత్తనాలు రైతాంగానికి అందజేయాలని, పంట దిగుబడులు శాతం ఎకరాకు 15శాతం పెంచాలని అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. గత ఏడాది ఖరీఫ్‌లో ఎకరాకు 28 బస్తాల వరి దిగుబడులు రాగా, ఈ ఏడాది 32 బస్తాలు ఎకరాకు వరి దిగుబడులు పెంచాలని భావిస్తున్నారు. అలాగే భూమిలో నత్రజని, పొటాష్ సారం పెంచేందుకు 2.300 క్వింటాళ్ల పచ్చిరొట్ట ఎరువులు సిద్ధం చేశారు.

ఎరువులు ఇలా..

జిల్లాలో ఖరీఫ్ నాటికి 42,225 మెట్రిక్‌టన్నుల యూరియా, 17.206 మెట్రిక్‌టన్నుల డీఏపీ, 4,174 మెట్రిక్‌టన్నుల పొటాష్, 5,149 మెట్రిక్‌టన్నుల కాంప్లెక్స్ ఎరువులు, 297 మెట్రిక్‌టన్నుల సూపర్‌పాస్పేట్ ఎరువులు అవసరమని వ్యవసాయశాఖ ప్రణాళికలు సిద్ధం చేసింది. గతంలో ఎన్నడు లేని విధంగా మే నాటికే 13వేల మెట్రిక్ టన్నుల ఎరువులు బఫర్‌స్టాక్ సిద్ధం చేసింది. జూన్ నాటికి 15వేల మెట్రిక్ టన్నుల ఎరువులు రైతు సేవా కేంద్రాలు, మార్క్‌ఫెడ్ గోదాముల్లో సిద్ధం చేయాలని సంకల్పించింది. జిల్లాలో వ్యవసాయశాఖ సబ్‌డివిజన్ల వారీ టెక్కలిలో 12,283 మెట్రిక్‌టన్నులు, శ్రీకాకుళంలో 8,500 మెట్రిక్‌టన్నులు, సోంపేటలో 10,223 మెట్రిక్‌టన్నులు ఎరువులు అవసరమని అధికారులు గుర్తించారు. అలాగే రణస్థలంలో 9,531 మెట్రిక్‌టన్నులు, పలాసలో 8,372 మెట్రిక్‌టన్నులు, నరసన్నపేటలో 8,705 మెట్రిక్‌టన్నులు, కొత్తూరులో 11,235 మెట్రిక్‌టన్నుల ఎరువులు అవసరమని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. జిల్లాలో ఎరువుల వినియోగంలో జి.సిగడాం, నందిగాం మొదటి రెండు స్థానాలు కాగా, చివరి స్థానాల్లో నరసన్నపేట, బూర్జ మండలాలు ఉన్నాయి.

కొరతరానీయం..

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ నాటికి రైతులకు ఎరువులు, వితనాల కొరత రానీయం, ఇప్పటికే బఫర్‌స్టాక్ సిద్ధం చేశాం. రైతుసేవా కేంద్రాలు ద్వారా రైతులకు అందజేస్తాం.

-బీవీ తిరుమలరావు, వ్యవసాయశాఖ ఏడీ, టెక్కలి

అంతా సిద్ధం..

ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ప్రణాళిక సిద్ధమైంది. ఈ నెల చివరి వారం లేదా, జూన్ మొదటి వారంలోపు విత్తనాలు రైతు సేవా కేంద్రాలకు పూర్తి స్థాయిలో చేరుకుంటాయి. పీఏసీఎస్‌ల తోపాటు ప్రైవేటు డీలర్ల వద్ద విత్తనాలు అందుబాటులోకి వస్తున్నాయి. రైతులకు సాగు సలహాలు, సూచనలు అందించేందుకు సిద్ధంగా ఉన్నాం. ఖరీఫ్‌లో ఎరువులు, విత్తనాల కొరత లేకుండా చూడాలన్నదే ప్రభుత్వ లక్ష్యం.

-టి.భార్గవి, మండల వ్యవసాయశాఖ అధికారి, ఇచ్ఛాపురం

మామిడి బద్దకు మంచి గిరాకీ

- చింతపండునకు ప్రత్యామ్నాయంగా వాడకం
- ఒడిశా నుంచి తెచ్చి అమ్ముతున్న వ్యాపారులు

పలాస రూరల్, మే 10(ఆంధ్రజ్యోతి): పూర్వం వంటల్లోకి మామిడి బద్దను అధికంగా వాడేవారు. రానురాను చింతపండు వాడకం మొదలుపెట్టిన తరువాత బద్దల గురించి మర్చిపోయారు. అయితే చింతపండు అధికంగా వాడడం వల్ల గ్యాస్ట్రిక్, ముడుకుల నొప్పులు వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో వైద్యులు చింతపండు వాడకాన్ని తగ్గించాలని సూచనలు చేస్తుండ డంతో మామిడిబద్దకు డిమాండ్ పెరిగింది. ఆహార పదార్థాల్లో వీటినే వాడుతున్నారు. ఒడిశా ప్రాంతంలో ఈ మామిడి బద్దల వాడకం ఉంది. పక్క రాష్ట్రమే కావడంతో వర్తకులు అక్కడి నుంచి ఇక్కడికి తీసుకుని వచ్చి ఎండు మామిడిబద్దలను అమ్ముతున్నారు. ఇవి మార్చి నుంచి జూన్ వరకు విరివిగా లభ్యమవుతాయి. ముఖ్యంగా సంతకూడళ్లలో వీటి అమ్మకాలు జోరందుకున్నాయి. ప్రస్తుతం ఎండు మామిడిబద్దలు అరకేజీ ప్యాకెట్లలో రూ.100 పలుకుతుండగా, పచ్చిమామిడి కాయలను తొక్క తొలగించి కిలోకు రూ.50 నుంచి రూ.60కు విక్రయిస్తున్నారు. పలాస మండల ప్రాంతంలోనైతే రెంటికోట, తర్లాకోట ప్రాంతాల నుంచి వర్తకులు ఒడిశా నుంచి తీసుకుని వచ్చి అమ్ముతున్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో శుక్రవారం జరిగే సంతలో వీటి అమ్మకాలు అధికంగా ఉంటాయి. అయితే పచ్చి మామిడి బద్దలను వినియోగ దారులు కొనుగోలు చేసి వాటికి ఉప్పును కలిపి ఎండబెట్టి సంవత్సరానికి సరిపడా నిల్వ చేస్తుంటారు. కాగా పులుపు కోసం చింతపండును పప్పు, చారు, కూరల్లో వాడుతుంటారు. హోమి యో మందులను వాడుతున్న వారు మాత్రం చింతపండును తగ్గించాల్సి ఉంటుంది. దీంతో వారు మామిడి బద్దలను వాడు తుంటారు. పలాస, కాశీబుగ్గ మార్కెట్‌తో పాటు మందస, బ్రాహ్మణతర్లాలో అధికంగా బద్దల అమ్మకాలు సాగుతున్నాయి.



పలాస సంతలో మామిడి బద్దల అమ్మకాలు



ఆరోగ్య ఉప కేంద్రంలో నిల్వలు



గడ్డివాములు దృశ్యం

ఆక్రమణలో ఉపకేంద్ర భవనం

సరుబుజ్జిలి, మే 10(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య ఉపకేంద్ర భవనాన్ని ఓ వ్యక్తి ఆక్రమించేశాడు. మండలంలో 14 గ్రామ సచివాలయా ల పరిధిలో భవన నిర్మాణాలు పూర్తి చేసినా పాలవలస, చిగురువలస, మతలబుపేట సచివాలయ భవన నిర్మాణాలు ఇప్పటికీ అసంపూర్తిగానే ఉన్నాయి. మతలబుపేట సచివాలయ పరిధిలో ఉన్న ఆరోగ్య ఉపకేంద్ర భవనం పైకప్పు వరకు పూర్తయింది. ఈ భవనాన్ని అదే గ్రామానికి చెందిన ఒక వైసీపీ నాయకుడు కబ్జా చేశాడు. అందులో ధాన్యం బస్తాలు నిల్వ చేస్తున్నాడు. గడ్డివాములు వేసి పశువుల శాలలుగా వినియోగించుకుంటున్నాడు. దీనిపై గ్రామస్థులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు లేవు. జిల్లా అధికారులు చర్యలు తీసుకుని మతలబుపేట ఆరోగ్య ఉప కేంద్ర భవనాన్ని ఆక్రమణల చెర నుంచి విడిపించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఆకట్టుకుంటున్న రంజుడోలు వాయిద్యం

పలాస రూరల్, మే 10(ఆంధ్రజ్యోతి): మనకున్న పలు సంగీత వాయిద్యాల్లో రంజుడోలుకు ప్రత్యేక స్థానం ఉంది. ఆలయాలు, షాపింగ్ మాల్స్ ప్రారంభోత్సవాల్లో ఈ వాయిద్యానికి అధిక ప్రాధాన్యతనిస్తుంటారు. దీన్ని వాయిస్తుంటే యుద్ధభేరి మోగుతున్న శబ్దం వస్తుంది. ఎవరైనా కచ్చితంగా ఆగి వినిపోవాల్సిందే. ప్రస్తుతం అంపోలుకు చెందిన కళాకారులు పలాస మండలంలోని పలు ఆలయాల సముదాయం, ఇతర ఇళ్ల వద్ద వాయిస్తూ వారి ప్రతిభను ప్రదర్శిస్తున్నారు.

రంజుడోలును వాయిస్తున్న కళాకారుడు



రెయిలింగ్ కూలడంతో రైతులకు అగచాట్లు

● శిథిలావస్థకు చేరినా మరమ్మతులు కరువు ● ఇదీ వంశధార కాలువపై రహిమాన్‌పురం వద్ద వంతెన దుస్థితి

పోలాకి, మే 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రహిమాన్‌పురం వద్ద వంశధార కాలువపై ఏర్పాటుచేసిన వంతెన రెండు దశాబ్దాలుగా మరమ్మతులకు నోచుకోకపోవడంతో శిథిలావస్థకు చేరింది. ప్రధానంగా వంతెనకు సంబంధించిన రెయిలింగ్ ఒక వైపు కూలిపోవడంతో వాహనాల రాకపోకలకు అగచాట్లు తప్పడం లేదు. దీనికితోడు వంతెన కింది భాగంలో గజాలు తుప్పపట్టి ప్రమాదకరంగా మారాయి. ఏ క్షణమైనా కూలిపోయే ప్రమాదముందని రైతులు ఆందోళన చెందు తున్నారు.

రహిమాన్‌పురం వద్ద 25 సంవత్సరాల వంశధార కాలువపై రైతులు పంట ఉత్పత్తులు కల్లాలకు చేర్చేందుకు వంతెన నిర్మించారు. వర్షాకాలంలో పంట పొలాలకు ఈ వంతెన మీదుగా యంత్రాలు, ఎరువులు తరలిస్తుంటారు. పంట ఉత్పత్తులను కల్లాలకు చేర్చడానికి వంతెన ఎంతగానో ఉపయోగపడుతోంది. అయితే రెండు దశాబ్దాలు దాటడంతో వంతెన పైభాగం, కిందభాగంలో గజాలు తప్పుపట్టి శిథిలావస్థకు చేరింది.దీంతో వరి పంటను బండ్లు, ట్రాక్టర్లతో తరలించే సమయంలో వంతెన ఊగుతోందని రైతులు చెబుతున్నారు. ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన తర్వాత వంతెన పునర్నిర్మాణానికి నిధులు మంజూరుచేయించాలని బగ్గు రమణమూర్తికి ఆ గ్రామస్థులు కోరారు. దీంతో ఎమ్మెల్యే సంబంధిత వంశధార ఇంజనీర్ సింహాచలాన్ని పంపించి కొత్తవంతెన నిర్మాణానికి అంచనా వ్యయం రూపొందించి నివేదిక ఇవ్వాలని సూచించారు. వంతెన ఇరుగ్గా ఉండడంతోపాటు రెయిలింగ్ లేకపోవడంతో ఇటీవల ఎద్దుల బండి బోల్తాపడింది. దీంతో ఒక ఎద్దుకు బలమైన గాయమై మృతిచెందిందని రైతులు తెలిపారు. ప్రధానంగా చీకటిపడిన తర్వాత ఈ మార్గంలో గ్రామంలోకి వాహనాలపై వచ్చే రెయిలింగ్ లేకపోవడంతో కాలువలోకి దూసుకువెళ్లే ప్రమాదముందని భయాందోళన చెందుతున్నారు. దీంతో వంతెన పునర్నిర్మాణానికి నిధులు మంజూరుచేయాలని రహిమాన్‌పురం గ్రామానికి చెందిన సనపల సోమేశ్వరరావు, ఉప్పాడ శ్రీనివాసరామకృష్ణ, ముఖుందరావు, శ్రీనివాసరావుతోపాటు పలువురు రైతులు ఇటీవల ఎమ్మెల్యే బగ్గురమణమూర్తికి వినతిపత్రం అందజేశారు.



వంతెనకు ఓ వైపు రెయిలింగ్ కూలిపోయిన దృశ్యం

హైకోర్టు న్యాయమూర్తిని కలిసిన న్యాయవాదులు



జస్టిస్ సుబ్బారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న న్యాయవాదులు

శ్రీకాకుళం లీగల్, మే10(ఆంధ్రజ్యోతి): హైకోర్టు న్యాయమూర్తి, శ్రీకాకుళం జిల్లా పోర్టుఫోలియా న్యాయమూర్తి జస్టిస్ సత్తి సుబ్బారెడ్డిని జిల్లా బార్ అసోసియేషన్ న్యాయవాదులు కలిశారు. శ్రీకాకుళంలోని జిల్లా కోర్టు ప్రాంగణంలో రెండురోజులపాటు జరగనున్న న్యాయమూర్తుల సదస్సులో పాల్గొనేందుకు శనివారం వచ్చారు.ఈమేరకుజిల్లా బార్‌అసోసియేషన్ ప్రతినిధులు కలిశారు.ఈసందర్భంగా బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు తంగి శివప్రసాద్ మాట్లాడుతూ జిల్లాకోర్టులోని పలు జూనియర్‌కోర్టుల్లో న్యాయమూర్తులను నియమించాలని వినతిపత్రం అందించినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా బార్‌అసోసియేషన్ ప్రధానకార్యదర్శి పిట్టాదామోదర్, ఉపాధ్యక్షులు సీతరాజు, మహిళాప్రతినిధి వనజాక్షిప్రతినిధులు భవానీ ప్రసాద్, కొమ్ము రమణమూర్తి, స్టేట్‌బార్ ప్రతినిధి గేదెలవాసుదేవరావు, న్యాయవాదులు రమణదయాళ్, పీవీ రమణరావు, బీఎస్ చలం పాల్గొన్నారు.

సరుబుజ్జిలిలో పోలీసుల తనిఖీలు

సరుబుజ్జిలి, మే 10(ఆంధ్రజ్యోతి):సరుబుజ్జిలి జంక్షన్‌లో శనివారం పోలీసులు వాహనాలు తనిఖీచేశారు.హెచ్‌సీ మెండ జనార్దనరావు ఆధ్వర్యంలో సిబ్బంది అలికాం-బత్తిలి ప్రధానరహదారిపై ద్విచక్రవాహనాలను తనిఖీ చేసి టాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న పలువాహనాల నిర్వా హకులపై కేసు నమోదుచేశారు.

గర్భిణులకు అమృత ఆహారం పంపిణీ

ఎచ్చెర్ల, మే 10(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని సత్యసాయి సేవా సంస్థలు నిర్వహిస్తున్న అమృతఆహారసేవ కార్యక్రమంలోభాగంగా ఎచ్చెర్ల పీహెచ్‌సీకి వచ్చిన గర్భిణులకు శనివారం ఉచితంగా భోజనం అందజేశారు. ప్రధాన మంత్రి మాతృత్వఅభియాన్ కార్యక్రమంలో భాగంగా పీహెచ్‌సీలకు వచ్చిన 60 మంది గర్భిణులు, సహాయకులు భోజనం పంపిణీచేశారు.

నవధాన్యాల సాగుతో మేలు

కంచిలి, మే10(ఆంధ్రజ్యోతి):నవధాన్యాల సాగుతో రైతులకు ఎంతోమేలు జరుగుతుందని ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ జిల్లా మేనేజర్ పూజారి సత్యనారాయణ తెలిపారు. శనివారం బూరగాంలో నవధాన్యాల ప్రాధాన్యతపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్ దుర్గాప్రసాద్,కామరాజు ఆధ్వర్యంలో 93నవధాన్యాల కిట్లురైతులకు అందజేశారు.

దూసిపేటలో శివలింగం పునః ప్రతిష్ఠ



ఆమదాలవలస: యాగం నిర్వహిస్తున్న రుత్వికులు

ఆమదాలవలస, మే 10 (ఆంధ్రజ్యోతి):మండలంలోని దూసిపేటలో కాశీవిశ్వేశ్వరస్వామి శివలింగం పునఃప్రతిష్ఠ కార్యక్రమం గ్రామస్థులు వైభవంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం శివలింగంతోపాటు నవగ్రహాల విగ్రహాలను జలాధివాసం చేశారు. శనివారం క్షీరాధివాసం, ధాన్యాదివాసం చేపట్టారు. ఆదివారం శివలింగం, నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠ జరగనుంది. ఈసందర్భంగా సూర్య నమస్కారాలు, మహారుద్రాభిషేకం, ప్రత్యేక యాగాలుతెలుగు పండితులు మావుడూరు అన్నాజీరావు ఆధ్వర్యంలో నిర్వహించారు.కార్యక్రమంలో బంకుపల్లి భాస్కర్‌శర్మ, కిషోర్‌శర్మలతోపాటు 21 మంది రుత్వికులు పాల్గొన్నారు.

పురుషోత్తపురంలో మహాయజ్ఞం

ఇచ్ఛాపురం, మే10(ఆంధ్రజ్యోతి): పురుషోత్తపురంలో మూడురోజులుగా విశ్వశాంతి ఏకకుండి వైష్ణవ మహాయజ్ఞం వైభవంగా జరుగుతోంది. శనివారం సూర్యవిష్ణు సహస్రనామం, తులసీ, గోపూజలు, ఘృతయజ్ఞం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నర్తు రామారావు, మునిసిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి ప్రత్యేకపూజలు చేశారు. యజ్ఞం నిర్వాహకులకు రామారావు రూ.10వేలు అందజేశారు. కార్యక్రమంలోవార్డు కౌన్సిలర్లు సుగ్గు ప్రేం, చాట్లపుష్ప, నర్తు నరేంద్ర, నర్తు ప్రేం, చాట్ల తిరుపతి పాల్గొన్నారు.

సాయిబాబా మందిరం వార్షికోత్సవం

శ్రీకాకుళం కల్చరల్,మే10(ఆంధ్రజ్యోతి):గుజరాతీపేటపరిధిలోగల హయాతినగరంలో ఉన్న షిర్డీ సాయిబాబా మందిరం 15వ వార్షికోత్సవం శనివారం నిర్వహించారు.ఈసందర్భంగా సామూహిక రుద్రాభిషేకం, క్షీరాభిషేకం, అన్నదాన కార్యర్యక్రమం నిర్వహించారు. కిల్లాన బోజ్‌కుమార్, శశి బూషణరావు, కిల్లాన శ్రీనివాసరావు దంపతులు పూజల్లో పాల్గొన్నారు.

నారాయణ తిరుమలలో స్వర్ణ కవచ దర్శనం

శ్రీకాకుళంలోని పీఎన్‌కాలనీలో ఉన్న నారాయణ తిరుమలలో శనివారం వేంకటేశ్వర స్వామి స్వర్ణకవచ దర్శనం కల్పించారు.ఈ సందర్భంగా స్వామి వారికి ఊయల సేవ నిర్వహించారు. ఆదివారం వేంకటేశ్వర స్వామికి రజత కవచ దర్శనం కుంకుమ పూజలు నిర్వహించనున్నట్లు నారాయణ తిరుమల నిర్వాహకులు తెలిపారు.

శ్రీకాకుళంలో అన్నమయ్య భక్తి సంగీత విభావరి

శ్రీకాకుళం కల్చరల్,మే10(ఆంధ్రజ్యోతి):శ్రీకాకుళంలోని రెడ్‌క్రాస్ సొసైటీ భవనంలో తరణికృష్ణ స్మారక ధార్మిక సేవా ట్రస్ట్ అధ్యక్షుడు మండా శ్రీనివాస్ ఆధ్వర్యంలో రచయిత దూసి ధర్మారావు వర్ధంతి సందర్భంగా అన్నమ్మయ్య పదం భక్తిసంగీత విభావరి కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన భక్తి సంగీత సుధలో గాత్రం మండ విజయ్‌కుమార్ స్వరకల్పన చేయగా వయోలిన్ దూసి రమేష్, మృదంగం వాయిద్య సహకారం మండా శ్రీనివాసరావు అందించారు.

చర్చిలో ప్రార్థనలు

ఇచ్ఛాపురం,మే10(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని ఆంధ్రాబాప్టిస్ట్ చర్చిలో యుద్ధంలో వీరమరణం చెందిన సైనికుల ఆత్మకుశాంతిచేకూరాలని పాస్టర్ జాన్సన్ ఆధ్వర్యంలో క్రైస్తవులు ఉపవాసంతో శనివారం గొలుసు ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో చర్చి అధ్యక్షుడు పి.ప్రత్తి విజయ్‌కుమార్, కార్యదర్శి తాతాజీబాబు, ట్రెజరర్ వజ్రపు వెంకటేష్, ప్రత్తి అన్వేష్‌బాబు, జోష్‌కుమార్, వీరకుమార్, సుష్మ పాల్గొన్నారు.

శ్రీకాకుళంలో రక్తదాన శిబిరం

శ్రీకాకుళం కల్చరల్, మే10(ఆంధ్రజ్యోతి):శ్రీకాకుళంలోని కళ్యాణ వేంకటేశ్వర దేవస్థానం ఆవరణలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం శనివారం నిర్వహించారు.ఈసందర్భంగా నేత్ర,దంతవ్యాధులకు చికిత్స, మహిళలు, పురుషులకు బీపీషుగర్, కీళ్లనొప్పులకు వైద్య నిపుణులు తనిఖీచేశారు. పేదలకు వంటపాత్రలు పంపిణీచేశారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ అధ్యక్షుడు జగన్మోహనరావు, ఆలయ గౌరవాధ్యక్షుడు లోకనాధం నందికేశ్వరరావు, అధ్యక్ష, కార్యదర్శులు యోగేశ్వరరావు, బెహరా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు కార్డుల పంపిణీ

బూర్జ, మే 10 (ఆంధ్రజ్యోతి): బూర్జలో టీడీపీ సభ్యత్వనమోదు కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఆ పార్టీ నాయకుడు వేపారి వెంకటేష్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో 500 మందికి పైగా సభ్యత్వ నమోదు చేసినట్లు తెలిపారు.

గిరివానిపాలెంలో ఎడ్లబండ్ల పోటీలు

రణస్థలం, మే 10 (ఆంధ్రజ్యోతి): గిరివానిపాలెంలో బంగారమ్మ గ్రామ సంబరాల నేపథ్యంలో శనివారం ఎడ్లబండ్ల పోటీలు నిర్వహించారు. అనకాపల్లి నుంచి ఆరు ఎడ్లబండ్లు పోటీల్లో పాల్గొన్నాయి. విజేతలకు ఉత్సవ కమిటీ సభ్యులు బహుమతులు అందజేశారు.

ఆలయ భూముల పరిరక్షణకు చర్యలు

● ఆమదాలవలస ఎమ్మెల్యే, పీయూసీ చైర్మన్ కూన రవికుమార్



రవికుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న మధురెడ్డి

పొందూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): దేవదాయశాఖ,ట్రస్టుల పరిధిలో ఉన్న ఆలయాల భూముల పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఆమదాలవలస ఎమ్మెల్యే, పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ తెలిపారు. పొందూరులోని శాలిహుండాం వేణుగోపాలస్వామి భూములను పరిరక్షించాలని ఆ ట్రస్టు చైర్మన్ సుగ్గు మధురెడ్డి శనివారం రవికుమార్‌కు పెనుబర్తిలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వందేవుని భూముల రక్షణలో చిత్తశుద్ధితో ఉందని, ఆక్రమణలకు గురైన భూములపై సర్వే జరిపి తిరిగి దేవదాయశాఖ, ట్రస్టులకు అందించేలా చర్యలుతీసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.పొందూరులోని శాలిహుండాం ట్రస్టుకు 198 సర్వేనంబరులో 1.47 ఎకరాలు, 241లో 98 సెంట్లు, 6-3లో 3.18 ఎకరాలు, 173లో 2.87 ఎకరాల భూముల ఉన్నాయని, ప్రస్తుతం చాలాభూములు అన్యాక్రాంతంలో ఉన్నాయని మధురెడ్డి వివరించారు.వాటికి సంబంధించి రెవెన్యూపత్రాలు ఉన్నాయని తెలిపారు.ట్రస్టుకు శాశ్వత ఆదాయంకోసం భూములను చట్టప్రకారం వినియోగించాలని మధురెడ్డికి రవికుమార్ సూచించారు. ట్రస్టుభూముల రక్షణకు తీసుకున్న చర్యలకు తాను అండగా ఉంటానని మధురెడ్డికి భరోసాఇచ్చారు.దేవాదాయశాఖ కమిషనర్‌తో తాను మాట్లాడతానని భూముల రక్షణకు అవసరమైతే పోలీసుల సహకారంతో ఆక్రమణలు తొలగించాలని సూచించారు.

సమ్మెను జయప్రదం చేయండి

● అఖిలపక్ష కార్మిక, ఉద్యోగ సంఘాల నాయకులు



మాట్లాడుతున్న కార్మిక సంఘ నాయకులు

అరసవల్లి,మే 10(ఆంధ్రజ్యోతి): నాలుగు లేబర్‌కోడ్లు రద్దు చేయాలని, నూతన మార్కెట్ చట్టాన్ని రద్దు చేయాలన్న తదితర డిమాండ్లతో ఈ నెల 20న నిర్వహించనున్న జాతీయ సమ్మెను జయప్రదం చేయాలని అఖిలపక్ష కార్మిక, ఉద్యోగ సంఘల నాయకులు కోరారు.శనివారం శ్రీకాకుళంలోని క్రాంతిభవన్‌లో సంయుక్త కిసాన్‌మోర్చా, రైతుల సంఘాల, ట్రేడ్ యూనియన్ల జిల్లాస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ తాండ్ర ప్రకాష్, ఏపీ రైతుసంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.చంద్రరావు, కె.మోహనరావు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెలమల రమణ, సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఎఫ్‌టీయూనాయకులు కృష్ణవేణి,ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.సంతోష్ మాట్లాడారు. పంటలకు మద్దతు ధర చట్టం చేయాలని, రైతుల, వ్యవసాయ కార్మికుల, రైతుల రుణాలు రద్దుచేయాలని, కౌలు రైతుల రక్షణకు సమగ్ర చట్టం రూపొందించాలని కోరారు.

కబడ్డీలో సత్తాచాటిన జిల్లా క్రీడాకారులు

● ఖేలో ఇండియాలో తృతీయస్థానం సాధించడానికి తోట్పాటు



కాంస్య పతకాన్ని సొంతం చేసుకున్న జిల్లా క్రీడాకారులు

శ్రీకాకుళం స్పోర్ట్స్, మే10 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాకు చెందిన ఇద్దరు క్రీడాకారులు ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో భాగంగా ఈనెల నాలుగు నుంచి ఎనిమిదో తేదీ వరకు బీహార్‌లోని రాజ్‌గిర్‌లో జరిగిన కబడ్డీ పోటీల్లో సత్తాచాటారు. ఆంధ్రప్రదేశ్ జట్టు తృతీయ స్థానం కైవసం చేసుకోవడంలో తోడ్పడ్డారు. ఆంధ్రప్రదేశ్ బాలుర జట్టు కాంస్య పతకాన్ని సాధించింది.ఈమేరకు జట్టులో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో సీతంపేట మండలంలోని జిల్లేడుపాడు నుంచి పాలక మణికంఠ, ఆమదాలవలస మండలంలోని అక్కులపేట నుంచి సత్తారు రామ్మోహన్‌రావు పాల్గొన్నారు. మణికంఠ, రామ్మోహన్‌రావు క్రీడాకారులకు జిల్లా కబడ్డీ సంఘం చైర్మన్, ఎమ్మెల్యే గొండుశంకర్, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కె.శ్రీధర్, సంఘం అధ్యక్షులు నక్క రామకృష్ణ, కార్యదర్శి ముసలినాయుడు, ఆర్గనైజింగ్ కార్యదర్శి సాధు శ్రీనివాసరావు, కోశాధికారి ఎన్.రమేష్, ఉపాధ్యక్షులు మెట్ట తిరుపతిరావు, సభ్యులు తవిటమ్మ, నారాయణరావు అభినందించారు.

వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలి



నిరసన తెలుపుతున్న కార్మికులు

పొందూరు, మే 10(ఆంధ్రజ్యోతి): ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ కార్మికులకు రెండునెలల వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు డిమాండ్‌చేశారు.శనివారం పొందూరులోని ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ కార్యాలయం ఎదుట వేతనబకాయిల చెల్లించాలని కార్మికులతో కలిసి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కనీస వేతనాలు చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు అమలుచేయాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. మార్చి, ఏప్రిల్ నెలలకు సంబంధించి వేతనాలు ఇంతవరకు చెల్లించకపోవడంతో కార్మికుల కుటుంబపోషణ ఎలా జరుగుతుందనిప్రశ్నించారు. కార్యక్రమంలో గ్యాస్‌ఏజెన్సీ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.రాధాకృష్ణ, బి.లక్ష్మీనారాయణ, అప్పలనాయుడు, వెంకటరావు, చిన్న పాల్గొన్నారు.

కళాకారులను ఆదుకోవాలి

రణస్థలం, మే 10(ఆంధ్రజ్యోతి): కనుమరుగవుతున్న కళారంగాన్ని ఆదరించి, కళాకారులను ఆదుకోవాలని విఘ్నేశ్వర కళానాట్యమండలి అధ్యక్షుడు ఆకెళ్ల సూరిబాబు తెలిపారు. శనివారం రణస్థలంలో కళాభిషేకం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కళాభిషేకం డైరెక్టర్ పెద్దరికంసాయి చేతుల మీదుగా 15 మంది కళాకారులకు ప్రశంసాపత్రాలు అందజేశారు.అంజన్న, బాలసుబ్రహ్మణ్యం కళా సేవను కీర్తిస్తూ కళాకారులు సన్మానించారు. కార్యక్రమంలో లక్ష్మణరావు, పి.రామి నాయుడ, ఎం.బ్రహ్మానందం, శివరాములు, డి.అప్పారావు, ఏపీఎస్ మూర్తి, బాలి సన్యాప్పలనాయుడు, కె.పడితల్లి, బి.వీర్రాజు, కె.సూర్యనారాయణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సోంపేట, మే 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని బుషాభద్ర సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల దృష్ట్యా పొత్రఖండ, మాకన్నపురం, బాతుపురం, ఎంజీపురం, సుంకిడి, బుషాభద్రల్లో ఆదివారం ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్‌సరఫరాకు అంతరాయం కలుగుతుందని పలాస ఈఈ యజ్ఞేశ్వరరావు తెలిపారు.

13 నుంచి భద్రమహంకాళి ఉత్సవాలు

పొందూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): రాపాకకూడలి సమీపంలో వెలసిన భద్రమహంకాళి అమ్మవారిఉత్సవాలు ఈనెల 13 నుంచి 15 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీసభ్యులు తెలిపారు. 14నపొన్నాడవారితో లలితసహస్ర నామ పారాయణం, 15నభద్రమహంకాళి సంబరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

ఆమదాలవలస, మే 10(ఆంధ్రజ్యోతి):ఆమదాలవలసలోని రైల్వేస్టేషన్‌లో మూడో ప్లాట్‌ఫారంవద్ద శనివారం రైలుకింద పడి ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జీఆర్పీ ఎస్ఐ మధుసూదనరావు కథనం మేరకు.. రేగిడి ఆమదాలవలస మండలంలోని పుర్లైగ్రామానికి చెందిన రేగిడి సురేష్ (28) సురేష్ శ్రీకాకుళంలో ఓ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు.శుక్రవారం రేగిడి ఆమదాలవలసలో ఓ వివాహానికి హాజరై వస్తానని పనిచేస్తున్న నిర్వాహకులకు చెప్పివెళ్లాడు. ఇంతలో ఇంటికి వెళ్లి వచ్చిన సురేష్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు.సురేష్‌కు తల్లిదండ్రులకు ఒక్కడే కుమారుడు. తండ్రి జగన్నాథం గతంలోమృతిచెందాడు. సురేష్ మృతికి కారణాలు తెలియరావాల్సి ఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు.

నిర్వహణ లేక.. వినియోగంలోకి రాక

● రోడ్డు పక్కన పేరుకుపోతున్న చెత్త ● ఇదీ గుంజుమెట్ట వద్ద చెత్త సంపద తయారీ కేంద్రం పరిస్థితి



గుంజుమెట్టలో చెత్త నుంచి సంపదతయారీ కేంద్రానికి ఎదురుగా రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త

జలుమూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్లవానిపేట పంచాయతీ పరిధిలోగల గుంజుమెట్ట వద్ద చెత్త సంపద తయారీ కేంద్రం నిర్వహణ లేకపోవడంతో వినియోగంలోకి రాని పరిస్థితి నెలకొంది. చెత్తను సంపద తయారీ కేంద్రానికి తరలించకుండా రోడ్డు పక్కనే చెత్తను వ్యాపారులు డంప్ చేస్తు న్నారు. చల్లవానిపేట కూడలిలోని వ్యాపారులు, హోటళ్లు, టిఫిన్ షాపుల నిర్వాహ కులు, చికెన్ విక్రయదారులు చెత్త, వ్యర్థాలు గుంజుమెట్టవద్ద గల చెత్తసంపద కేంద్రం ఎదురు, వెనుక భాగంలో పారబోస్తున్నారు. అడపాదడపా కురిసే వర్షాలకు చెత్త కుళ్లడంతో దుర్వాసన వెలువడుతోందని శ్రీముఖలింగం వెళ్లే ప్రయాణికులు, స్థానికులు వాపోతున్నారు. చెత్త నుంచి సంపద సృష్టించి పంచాయతీలకు ఆదాయం సమకూర్చాల్సిఉంది. వచ్చే ఆదాయంతో గ్రామాలు అభివృద్ధికి ప్రభుత్వం వెచ్చించాలి. అయితే అధికారుల నిర్లక్ష్యం వల్ల చెత్త సంపద కేంద్రాలు వినియోగంలోకి రాకపోవడంతో ప్రభుత్వం లక్ష్యం అటకెక్కుతోంది. ఇప్పటికైనా ప్రతిరోజూ చెత్తను తరలించి రోడ్డుపక్కనే పారబోస్తున్న వారికి నోటీసులు జారీచేసి కేసులు నమోదుచేసి రోడ్డు పక్కన చెత్త వేయకుండా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని, చెత్త సంపద తయారీ కేంద్రం విని యోగంలోకి తీసుకు రావాలని పలువురు కోరు తున్నారు.

శ్మశానవాటిక అభివృద్ధికి అంగీకారం

ఇచ్ఛాపురం, మే10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వల్లభరాయిగెడ్డ శ్మశానవాటిక అభివృద్ధికి ప్రజాప్రతినిధులు అంగీకరించారు. శనివారం ఇచ్ఛాపురంలోని రోటరీ హాల్‌లో ప్రజాప్రతినిధులు గ్రామపెద్దలు, ప్రముఖులతో సమావేశం నిర్వహించారు.శ్మశాన వాటికలో గ్యాస్ ఉపయోగించి దహనసంస్కారాల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేసేందుకు రోటరీ క్లబ్ గతంలో మునిసిపల్ కౌన్సిల్ అంగీకారం కోరింది. ఈ విషయమై కౌన్సిల్ ఆమోదం తెలియజేసినా స్థానికుల నుంచి అభ్యంతరాలు రావడంతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మునిసిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ఎవరి మనోభావాలు దెబ్బతినకుండా ప్రాజెక్ట్‌ను పూర్తి చేయాలని, తమ సహకారం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి రాజు, కాళ్ల ధర్మారావు, ఉలాల భాలయ్య, లీలారాణి, నాగరాజు పాత్రో, కాళ్ల దిలీప్, నందికి జాని, రోటరీ క్లబ్ కమిటీ సభ్యులు రాజ్‌కుమార్, పి.దినేష్‌కుమార్, పాక తులసీదాస్, రామారావు పాల్గొన్నారు.

మహాలక్ష్మీ నగర్‌లో చోరీ



బీరువా తలుపులు తెరిచి చిందరవందరగా పడేసిన దుస్తులు

శ్రీకాకుళం రూరల్, మే 10(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని మహాలక్ష్మీ నగర్ కాలనీ అజంతా గార్డెన్స్‌లో శుక్రవారం రాత్రి తాళం వేసిన ఓ ఇంట్లో చోరీ జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. సీమెన్‌గా పని చేస్తున్న అర్జాల గురుమూర్తి కుటుంబంతో కలిసి మహాలక్ష్మీనగర్‌లోని అజంతా గార్డెన్స్‌లో కొన్నేళ్లుగా నివాసముంటున్నాడు. మంగళవారం ఇంటికి తాళం వేసి పలాస మండలం అక్కుపల్లి వద్ద గల వంకులూరులో తన మేనకోడలి వివాహానికివెళ్లిపోయారు. శనివారం ఉదయం తమ నివాసానికి చేరుకునేసరికి ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తలుపులు తెరిచి ఉండడం, వస్తువులన్నీ చిందరవందర గా పడి ఉండడం గమనించి చోరీ జరిగిందని గుర్తించారు. దీంతో శ్రీకాకుళం రూరల్ పోలీసులకు సమాచారం అందజేయడంతో వారు ఘటనా స్థలానికి చేరుకున్నారు. తొమ్మిది తులాల బంగారు ఆభరణాలు, రూ.20 వేల నగదు పోయినట్లు పోలీసులు గుర్తించారు. సంఘటనా స్థలాని క్లూస్ టీం పరిశీలించి, చేతి వేలిముద్రలను సేకరించింది. గురుమూర్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. సిబ్బందితో కలిసి, దర్యాప్తు ప్రారంభించామని, త్వరలో నిందితులను పట్టుకుంటామని శ్రీకాకుళం ఒకటో పట్టణ సీఐ పైడపు నాయుడు, రూరల్ ఎస్‌ఐ కె.రాము తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



దశరథరావు (ఫైల్)

టెక్కలి/నందిగాం, మే 10(ఆంధ్రజ్యోతి): జగతిమెట్ట సమీపంలో జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నందిగాం మండలం రథ జనబొడ్డపాడు గ్రామానికి చెందిన బొడ్డ దశరథరావు (40) కోటబొమ్మాళి మండలం శ్రీపురం వెళ్లి కూరగాయలు కొనుగోలు చేసి తిరిగి వస్తున్న సమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని అక్కడి కక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. తన కుమారుడికి అంత్యక్రియలు చేసేందుకు ఆర్థిక ఇబ్బందులున్నాయని తల్లి రామలక్ష్మి ఆర్డీవో ఎం.కృష్ణ మూర్తికి తెలియ జేయడంతో ఆయన స్పందించారు. తహసీల్దార్ రవికుమార్ మృతుడి అంత్యక్రియలకు రూ.10 వేలు అందజేశారు. దశరథరావు(46) రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో స్వగ్రామం రథజనబొడ్డపాడులో విషాదం నెలకొంది. ఈయన భార్య శోభారాణి గత ఆగస్టులో అనారోగ్యంతో మృతి చెందగా లోహరబందకు చెందిన మరో మహిళను ఇటీవల వివాహ మాడాడు. వివాహమై నెలరోజులు కాకముందే మృతి చెందడంతో కుటుంబ సభ్యులు లబోదిబోమంటున్నారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలుండగా వారిలో ఒకరికి వివాహమైంది.

రైలు ఢీకొని వృద్ధుడు..

ఇచ్ఛాపురం, మే 10(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం రైలు నిలయం సమీపంలో గల బాహుదానది రైల్వే బ్రిడ్జి వద్ద రైలు ఢీకొట్టిన్న సంఘటనలో గుర్తుతెలియని సుమారు 70 సంవత్సరాల గల వ్యక్తి మృతి చెందాడు. మృతుడు తెలుపు రంగు గల షర్ట్, ఎర్రని లుంగీ ధరించి ఉన్నాడని, ఎవరికైనా తెలిస్తే 9440627567 ఫోన్ నెంబరుకు సమాచారం ఇవ్వాలని పలాస జీఆర్‌పీ పోలీసులు తెలిపారు.ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

12 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

శ్రీకాకుళం రూరల్, మే 10(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం రూరల్ మండలంలోని పెద్దపాడు సమీపంలో రామిగెడ్డలో ఫ్రెండ్స్‌కాలనీలో పేకాట స్థావరంపై శనివారం ఎస్‌ఐ రాము సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న 12 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.1,72,260 లక్షల నగదుతో పాటు, 12 సెల్‌ఫోన్లు, నాలుగు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి రాంబాబు మృతి



రాంబాబు (ఫైల్)

పోలాకి, మే 10(ఆంధ్రజ్యోతి): టీడీపీ పార్లమెంటరీ రైతు కార్యదర్శి, యూనిట్ ఇన్‌చార్జి, మాజీ సర్పంచ్ లుకలాపు రాంబాబు (48) శనివారం సాయంత్రం అనారోగ్యంతో మృతి చెందారు. మృతుడి భార్య లుకలాపు కల్పన పోలాకి సర్పంచ్‌గా గతంలో సేవలందించారు. మృతుడికి ఇద్దరు కుమారులున్నారు. రాంబాబు కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతూ స్వగృహంలోనే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. రాంబాబు మృతికి ఎమ్మెల్యే బగ్గు రమణ మూర్తి దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. మంచి కార్యకర్తను కోల్పోయామన్నారు. అలాగే డీసీసీబీ మాజీ చైర్మన్లు డోల జగన్, కరిమి రాజేశ్వరరావు, సర్పంచ్ మజ్జి లక్ష్మీ రమణమ్మ, మండల సాగునీటి సంఘం డిస్ట్రిబ్యూటరీ అధ్యక్షుడు మిరియబ్బిల్లి వెంకట అప్పలనాయుడు, తూలుగు అశోక్‌కుమార్, యందవ హరికృష్ణ, కిల్లి వేణు, మెండ రామినాయుడు తదిత రులు సంతాపం తెలిపారు. రాంబాబు మృతదేహానికి ఆదివారం అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల అధ్య క్షుడు ఎంవీ నాయుడు తెలిపారు.

సరుకులు తక్షణం పంపిణీ చేయాలి

కొత్తూరు, మే 10(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో నిల్వ ఉన్న పౌష్టికాహారం, సరుకులను లబ్ధిదారులకు సకాలంలో అందించాలని సీడీపీవో యు.విమలకుమారి తెలిపారు. మేలో ఒకటి నుంచి అంగన్‌వాడీ ఆయాలకు, 15వ తేదీ నుంచి కార్యకర్తలకు సెలవులు ఉండడంతో కేంద్రాల్లో ఉన్న సరుకులను తక్షణం పంపిణీ చేయాలన్నారు. కేంద్రాలను విధిగా తెరిచి ఉంచాలని, విధులకు డుమ్మా కొట్టేవారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

గ్రామాల్లో సందడే.. సందడి

- పండగలు, విగ్రహ ప్రతిష్ఠలు
- కనులపండువగా ప్రత్యేక పూజలు
- ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

జిల్లాలోని పలు గ్రామాల్లో శనివారం అమ్మవారి సంబరాలతో పాటు ఆలయాల్లో విగ్రహ ప్రతిష్ఠలు, తిరువీధి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం కనిపించింది.



టెక్కలి: అమ్మవారిని ఘటాలతో ఊరేగిస్తున్న దృశ్యం

గ్రామదేవత సంబరాలు ప్రారంభం

టెక్కలి, మే 10(ఆంధ్రజ్యోతి): ఏ గ్రామం చూసినా డప్పుల చప్పుళ్లు, అమ్మవారి ఘటాలు, పగటి వేషాలతో సందడిగా కనిపిస్తున్నాయి. వేసవిలో గ్రామదేవతలకు చల్లదనం చేయడం పల్లెల్లో ఆచారం కావడంతో గ్రామదేవత సంబరాలు కొన్నిచోట్ల సిరిమాను, మరికొన్ని చోట్ల ఘటాలతో పండగలు నిర్వహిస్తున్నారు. టెక్కలి మండలం పరశురాంపురంలో 95 ఏళ్ల తరువాత జోగిపోలమ్మ గ్రామ దేవత సంబరాలు చేపడుతున్నారు. ఊరంతా చుట్టాలు, బంధువులతో కళకళలాడుతోంది. లింగాలవలస పంచాయతీ సార్లిగాంలో పదేళ్లకు ఒకసారి జరిగే కొండరేగు పోలమ్మ గ్రామదేవత సంబరాలు మిన్నంటాయి. మొఖలింగాపురం పంచాయతీ చిన్నకేదారిలో ఊరమ్మ తల్లి సంబరాలు సందడిగా ప్రారంభమయ్యాయి. అయోధ్యపురంలో రెండు దశాబ్దాల తరువాత పాల పోలమ్మతల్లి ఉత్సవాలను ప్రారంభించారు. దేవర తేవడం, అమ్మవార్లకు ముర్రాటలు సమర్పించడం, ప్రత్యేక పూజలు, ఊరేగింపులతో గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం కనిపిస్తోంది. విద్యుత్ దీపాల అలంకర ణలతో గ్రామాలు శోభాయమానం కాగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

అశ్వవాహనంపై బ్రహ్మాండ నాయకుని తిరువీధి



అశ్వవాహనంపై శ్రీనివాసుని తిరువీధి దృశ్యం

నరసన్నపేట, మే 10(ఆంధ్రజ్యోతి): స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం శ్రీనివాసుడు అశ్వ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. వేద మంత్రాల మధ్య శ్రీదేవి, భూదేవి సహిత శ్రీనివాసునికి ఉదయం సుప్రభాత సేవ, ప్రత్యేక పూ జలు చేశారు. సాయంత్రం అశ్వ వాహనం పై వేంచేపు చేసి తిరువీధి ఉత్సవం చేపట్టారు. ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ

పోలాకి, మే 10(ఆంధ్రజ్యోతి): గంగివలస గ్రామంలో సర్వ మంగళాదేవి సహిత ధవళేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఇరువురిని ఆలయ కమిటీ ప్రతినిధులు సత్కరించా రు. అనంతరం యువకులు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో ఎమ్మెల్యే బగ్గు రమణ మూర్తి పాల్గొని రక్తదాతలను అభినందించారు. 20 మంది రక్తం దానం చేసినట్లు సర్పంచ్ బంకా చక్రధర్ తెలిపారు.



హారతి అందుకుంటున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

నేటి నుంచి కొత్తగ్రహారంలో గ్రామదేవత ఉత్సవాలు

నందిగాం, మే 10(ఆంధ్రజ్యోతి): కొత్తగ్రహారంలో ఆదివారం నుంచి పాలపోలమ్మ తల్లి గ్రామ దేవత ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. మూడురోజుల పాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు దేవరను గ్రామంలోకి తీసుకువచ్చి చల్లదనం చేస్తామన్నారు. రాత్రి డ్యాన్స్ ధమాకా డ్యాన్స్ నిర్వహిస్తు న్నామన్నారు. సోమవారం కోలాటం, కాంతార, ధూం ధడాకాతో పాటు రాత్రికి ఎంట ర్‌టైన్మెంట్ డ్యాన్స్ షో ఏర్పాటు చేశామన్నారు. మంగళవారం గ్రామ దేవత అమ్మవారి రథం ఊరేగింపు, పగటి వేషాలు మేళతాళాల మధ్య సాగుతుందన్నారు. గ్రామాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. పాల పోలమ్మతో పాటు నీలమ్మతల్లి, పాతపట్నం అమ్మతల్లి, భూలోకమ్మ అమ్మవార్లకు ముర్రాటలు పోసి చల్లదనం చేయనున్నామన్నారు. భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.



కొత్తగ్రహారం ముఖద్వారం



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న కలమట వెంకటరమణమూర్తి

ప్రతి ఒక్కరూ భక్తిభావంతో మెలగాలి

కొత్తూరు, మే 10(ఆంధ్రజ్యోతి): మహాసింగి గ్రామంలో వరాహ లక్ష్మీ నృసింహ స్వామి ఆలయ ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణమూర్తి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు భక్తిభావంతో సన్మార్గంలో పయనించాలన్నారు. పురాతన ఆలయాన్ని పునర్నిర్మించి ప్రారంభించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కర్లెమ్మ సర్పంచ్ ఎల్. భగవాన్‌దాస్‌నాయుడు, టీడీపీ నాయకులు పడాల లక్ష్మణరావు, గోగుల వరప్రసాదరావు, సీహెచ్ జోగినాయుడు, ఎల్.జనార్దనరావు, భక్తులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాసరూరల్, మే 10(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. పలాస మండలం రామకృష్ణాపురంలో ఎన్టీఆర్ హౌసింగ్ కాలనీలో రూ.3.16 కోట్ల జల్ జీవన్ మిషన్ నిధులతో చేపట్టిన ఇంటింటి కుళాయి పథకాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హౌసింగ్ కాలనీలో నివాసం ఉంటున్న వారికి తాగునీటిని అందించడమే కాకుండా ఇతర సదుపాయాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వసంత్‌కుమార్, ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, టీడీపీ మండల అధ్యక్షుడు కుత్తుమ లక్ష్మణ్‌కుమార్, నాయకులు పీరికట్ల విఠల్, లొడగల కామేశ్వరరావు, సప్ప నవీన్, కె.నర్సింహులు పాల్గొన్నారు.



తాగునీటి సరఫరా పథకం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

సారా నియంత్రణకు సహకరించాలి



మాట్లాడుతున్న ఎక్సైజ్ ఎస్‌ఐ శ్రీనివాసరావు

పాతపట్నం, మే 10 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సారా నియంత్రణకు ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ ఎస్‌ఐ బి.శ్రీనివాసరావు అన్నారు. కోదూరు పంచాయతీ పరిధి ప్రహరాజపాలెంలో నవోదయం 2.0లో భాగంగా శనివారం ప్రజలకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సారా, గంజాయి, డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాల వినియోగం వల్ల జీవితాలు నాశనమవుతాయన్నారు. వీటిని విక్రయించినా, సేవించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

వర్షపు నీరు నిలిచి ఇక్కట్లు



అండర్ పాసేజ్ వంతెన కింద చేరిన వర్షపు నీరు

నరసన్నపేట, మే 10(ఆంధ్రజ్యోతి): చిక్కాలవలస అండర్ పాసేజ్ వద్ద వర్షపునీరు నిలిచిపోయి వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 10 రోజుల కిందట పడిన వర్షపు నీరు పాసేజ్ కింద నిలిచిపోయింది. దీంతో పది రోజులవుతున్నా నీరు తగ్గకపోవడంతో ఆ మార్గంలో ప్రయాణం చేసే సుందరాపురం, కూర్మనాథపురం, పారశెల్లి, రెల్లివలస తదితర గ్రామాలకు చెందిన వాహన చోదకులు ప్రయాణించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. రైల్వేశాఖ అధికారులు స్పందించి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

ఆలయాల్లో శని త్రయోదశి పూజలు



ఉమామహేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

నరసన్నపేట, మే 10(ఆంధ్రజ్యోతి): పట్టణలో పలు నవగ్రహ మండపాల్లో శని త్రయోదశి పూజలు శనివారం నిర్వహించారు. భ్రమరాంబిక మల్లికార్జున స్వామి, ఉమామహేశ్వర స్వామి, తామరాపల్లి సాంబ జగదీశ్వరస్వామి ఆలయాల్లోని నవగ్రహ మండపాల్లో తైలాభిషేకాలు చేపట్టారు. గ్రహదోష నివారణ పూజలతో పాటు రాహు, కేతువు పూజలను చేయించారు.

న్యూస్ బాక్స్

కిడ్నీ ఆసుపత్రిలో ఉద్యోగాలకు 289 దరఖాస్తులు

పలాస, మే 10(ఆంధ్రజ్యోతి): స్థానిక కిడ్నీ పరిశోధన కేంద్రంలో ఔట్‌సోర్సింగ్ విధానంలో ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ ఇటీవల విడుదల చేయగా 289 దరఖాస్తులు వచ్చాయని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అల్లు పద్మజ ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధించి ఎటువంటి అభ్యంతరాలున్నా ఆధారాలతో మే 12 నుంచి 14వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోగా సమర్పించాలని కోరారు. డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ ఆధ్వర్యంలో ఖాళీలైన రిసెప్షన్ కమ్ రిజిస్ట్రేషన్ క్లర్క్-1, డయా లసిస్ టెక్నిషియన్-6, సిఆర్మ్ టెకీషియన్-2, జనరల్ డ్యూటీ అటెండెంట్లు-3, సెక్యూరిటీ-1లను భర్తీ చేయనున్నామన్నారు. పూర్తి వివరాల కోసం డబ్ల్యూడబ్ల్యూ డబ్ల్యూ.శ్రీకాకుళం.ఎపి.జిఓవి.ఇన్ వెబ్‌సైట్‌లో సంప్రదించాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పలాస, మే 10(ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ జి.యజ్ఞేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. చిన్నబడాం లైన్‌లో విద్యుత్ మరమ్మతులు చేపట్టనున్నామన్నారు. ఈ నేపథ్యంలో పెంటిభద్ర, జయరామచంద్రపురం, పద్మనాభపురం, పాత జాతీయ రహదారి, తాళభద్ర, చిన్నబడాం, నీలాపురం, నర్సిపురం, రైల్వేగేట్ డౌన్, పెసరపాడు, అంతరకుడ్డ, రాజపురం తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండద న్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

'అన్నదాత సుఖీభవ'కు దరఖాస్తులు

మందస, మే 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న 'అన్నదాత సుఖీభవ' పథకానికి రైతులు దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయాధికారి జి.నాగరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులకు పెట్టుబడి సాయం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకారం అందజేస్తోందన్నారు. కేంద్రం రూ.6 వేలు, రాష్ట్రం రూ.14 వేలు అందించనుందన్నారు. అర్హత కలిగిన రైతులు భూమి వివరాలకు 1బి, ఆధార్, రేషన్ కార్డుల నకళ్లను గ్రామ సచివాలయాలకు అందజేసి పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

ట్యాంకులతో నీటి సరఫరా

నరసన్నపేట, మే 10(ఆంధ్రజ్యోతి): నరసన్నపేట మేజర్ పంచాయతీల్లో గత నాలుగు రోజులుగా కుళాయిల ద్వారా నీరు రాకపోవడంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తక్షణం తగు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఆదేశించారు. ఈ నేపథ్యంలో శనివారం శివనగర్ కాలనీ, దేవాంగుల వీధి, కళాసీ కాలనీ తదితర కాలనీల్లో ట్యాంకుల ద్వారా తాగునీటిని సరఫరా చేశారు. మిగిలిన ప్రాంతాల్లోనూ ట్యాంకర్లతో నీటిని అందించాలని ఆయా వీధి వాసులు కోరుతున్నారు.

'ఎలుగు' సంచారంతో ఆందోళన

వజ్రపుకొత్తూరు, మే 10(ఆంధ్రజ్యోతి): ఉద్దానం తీరప్రాంత గ్రామాల్లోని జీడి తోటల్లో ఎలుగుబంటి ఒకటి రెండు రోజులుగా తిరుగుతుండడంతో స్థానికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ప్రస్తుతం జీడి, మామిడి, పనస పంట సీజన్ కావడంతో రైతులు ఎక్కువ సమయం తోటల్లోనే ఉంటారు. అయితే ఎలుగుబంటి కనిపించడం, గతంలో జరిగిన ఘటనల నేపథ్యంలో వారిలో భయాందోళన వ్యక్తమవుతోంది. ముఖ్యం గా బాతుపురం, చినవంక, డోకులపాడు గ్రామాల తోటల్లో ఎలుగు సంచారం ఉండడంతో రైతులు కలిసికట్టుగా తోటలకు వెళుతున్నారు. ఇప్పటివరకు ఎలుగుబంటి నుంచి ఎటువంటి దాడులు లేకపోయనా ప్రజలు మాత్రం ఫోన్ ద్వారా ఒకరికొకరు సమాచారం ఇచ్చుకుంటూ జాగ్రత్తలు పాటిస్తున్నారు. అటవీశాఖాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

బ్రిడ్జి నిర్మించారు.. అప్రోచ్ మరిచారు

- రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న నువ్వలరేవు గ్రామస్థులు

వజ్రపుకొత్తూరు, మే 10(ఆంధ్రజ్యోతి): నువ్వలరేవు ఉప్పుటేరుపై వంతెన నిర్మాణం చేపట్టినా అప్రోచ్ రోడ్డు వేయకపోవడంతో 50 గ్రామాల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ వంతెన పూర్తయితే ముఖ్యంగా మండల కేంద్రానికి వివిధ అవసరాల నిమిత్తం అటువైపు నుంచి వచ్చే ప్రజలకు దూరం, సమయం తగ్గుతుంది. అలాగే పర్యాటకంగా అభివృద్ధికి అవకాశం ఉంటుంది. 2014-2019లో టీడీపీ అధికా రంలో ఈ వంతెనను రూ.50 కోట్లతో అప్పటి ఎమ్మెల్యే గౌతు శివాజీ హ యాంలో నిర్మించారు. వంతెన పనులు జరిగి అప్రోచ్ రోడ్డు నిర్మాణం సమ యంతో సార్వత్రిక ఎన్నికలు సమీపించడం ఆ తరువాత ప్రభుత్వం మారడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. దీంతో ఎదురుగా విశాలమైన వంతెన కనిపిస్తున్నా వినియో గించుకోలేని దుస్థితి ఎదురైంది. ఇదిలా ఉండగా అప్రోచ్ రోడ్డు నిర్మాణం చేయాలంటే సుమారు 105 ఇళ్లు తొలగించాల్సి ఉంటుంది. కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నందున నిర్వాసితులతో మాట్లాడి పక్కా హామీ ఇస్తే సమస్య పరిష్కారమయ్యే అవకాశం ఉందని స్థానికులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు ఆ దిశలో చర్యలు తీసుకుని వంతెనను వినియోగంలోకి తీసుకు రావాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై ఆర్ అండ్‌బీ ఏఈ జగదీష్ వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి ఇళ్ల తొలగింపు అడ్డంకిగా ఉందని, ఈ విషయమై ఎమ్మెల్యే గౌతు శిరీషతో మాట్లాడామన్నారు. త్వరలో గ్రామస్థులతో సమావేశమై తగు చర్యలు తీసుకుంటామన్నారు.



టీడీపీ హయాంలో నిర్మించిన ఉప్పుటేరుపై వంతెన



వంతెన వద్ద నిలిచిన అప్రోచ్ రోడ్డు పనులు